శ్రీ దుర్గా సూక్తమ్

శ్రీరస్తు --- భావార్థముతో --- శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

దుర్గా సూక్తం విశ్వశ్రేయం

దుర్గా సూక్తం దుర్గా దేవిని ఆరాధించే ఏడు శ్లోకాల వేద శ్లోకం. ఇది మహా నారాయణ ఉపనిషత్తులో కనిపిస్తుంది. ఏడు శ్లోకాలలో నాలుగు అగ్ని భగవానుని ఆరాధిస్తాయి మరియు ఋగ్వేదంలో కూడా కనిపిస్తాయి.

అమ్మవారి అనంత తత్వాన్ని కీర్తించిన దుర్గా సూక్తం దేవికి సమర్పించిన అక్షరమాల.

దుర్గమ్మ శక్తి అపారం. కరుణ అనంతం పిలిస్తే పలుకుతుంది. వెన్నంటి నడిపిస్తుంది. దుష్టుల్ని శిక్షిస్తుంది. శిష్టులను రక్షిస్తుంది. ఆమె నామాన్ని స్మరిస్తే చాలు అనుగ్రహిస్తుంది. ఆనందమయ జీవితాన్ని ప్రసాదిస్తుంది. జ్ఞానదీప్తులను వెలిగించి, చెడును భస్మంచేసే అమ్మను దీపారాధనతో ఆహ్వానించాలి. అంటే శక్తిజనక మైన అగ్ని ప్రజ్వలనం. అందుకే మాత శక్తిదేవత కాదు.

దుర్గాదేవి విశ్వ దేవత॥ మనోమాలిన్యాలను తొలగించే మహాశక్తి దేవత. దేవీ స్తోత్రాల్లో తైత్తరీయ అరణ్యకం సప్త రుక్కులలో చెప్పిన 'దుర్గాసూక్తం' విలక్షణమైనది. విశిష్టమైనది.

దుర్గాసూక్తంలో "జాతవేదసే", "అగ్ని" అనే పదాలు 9 సార్లు పునరావృతమవడం విశేషం. నవరాత్రులు, నవ దుర్గలు, అమ్మవారు సంహరించిన 9 మంది రాక్షసులు – శ్రీచక్ర నవావరణ పూజకు సంకేతాలు.

మన కష్టాలన్నీ గతజన్మల కర్మఫలాలే. దుఃఖం, స్వార్థం, కోపం, ద్వేషం లాంటివనీ భీకర కెరటాలై పురోగతికి అడ్డుపడతాయి. ఆ అవలక్షణాలు మనలో ప్రవేశించకుండా దుర్గాదేవి కోటగోడలా అడ్డు నిలిచి సురక్షితంగా ఒడ్డుకు చేరుస్తుంది. అప్పుడు సంసార జంజాటం నుంచి వివడతాం.

'సమస్యల సంసార సాగరాన్ని దాటించేది నువ్వే. నిన్నే ఆశ్రయించాను. అగ్నిలా వెలిగే దుర్గామాతా! నా దుష్కర్మ ఫలాలను, నాలో ఉన్న అహంకారాన్ని భస్మం చేయమ్మా' అని దుర్గాదేవిని వేడుకోవడం ఇక్కడ కనిపిస్తుంది. దుర్గమ్మ చెడును దగ్ధంచేసే అగ్నిరూపం కనుక దేవి ఆరాధనలో దీపం ముఖ్యమైనది.

శ్రీ దుర్గా సూక్తమ్

(తైత్తిరీయ అరణ్యకమ్)

01. ఓం జాతవేదసే సునవామ సోమ
మరాతీయతో నిదహాతి వేదః।
స నః పర్షదతి దుర్గాణి విశ్వా
నావేవ సింధుం దురితాఽత్యగ్నిః॥

అగ్నిదేవా! సోమాన్ని పిండి రసాన్ని నీకు సమర్పిస్తాము. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను అగ్నిదేవుడు దగ్ధం చేయుగాక! పడవ ద్వారా సముద్రాన్ని దాటే విధంగా మమ్ములను సమస్త క్లేశాల నుండి, తప్పిదాల నుండి అగ్నిదేవుడు కాపాడుగాక!

ఓ అగ్నిదేవా! సోమమును (సోమలతను) నీకు సమర్పించెదము. మాకు జీవితంలో ఎదురయ్యే ఆటంకములు అగ్నిదేవుడు దగ్ధము చేయుగాక! నావ ద్వారా సముద్రమును దాటే విధంగా, మమ్మల్ని సమస్తమైన కష్టముల నుండి తప్పించి కాపాడుగాక!

02. తామగ్ని వర్ణాం తప సా జ్వలన్తీం
వై రోచనీం కర్మఫలేషు జుష్టామ్।
దుర్గాం దేవీగ్మ్ శరణమహం
ప్రపద్యే సుతరసి తరసే నమః॥

అగ్నివర్ణం సంతరించుకొన్నదీ, తపస్సు ద్వారా ప్రకాశించేది, భగవంతునకు చెందినదీ, కర్మ - దాని ప్రతిఫలాలలో శక్తిగా నెలకొన్నదీ అయిన దుర్గాదేవిని నేను శరణు జొచ్చుచున్నాను. దుఃఖసాగరం నుండి మమ్ములను తీరానికి చేర్చే దేవీ, మమ్ము కాపాడు. నీకు నమస్కారము.

అగ్నివర్ణముతో వెలిగి - తపశ్శక్తిచే ప్రకాశించే శక్తి స్వరూపిణి - కర్మఫలప్రదాయని అయిన శ్రీ దుర్గాదేవిని నేను శరణుజొచ్చుచున్నాను. ప్రపంచమనే దుఃఖసాగరము నుండి భక్తులను దరిచేర్చే ఓ దేవీ, మమ్ము కాపాడు. నీకు ప్రణమిల్లుతున్నాము.

03. అగ్నేత్వం పా రయా నవ్యో

అస్మాన్ స్వస్తిభిరతి దుర్గాణి విశ్వా।

పూశ్చ పృథ్వీ బహులా న ఉర్వీ

భవా తోకాయ తన యాయ శంయోః॥

అగ్ని దేవా! నువ్వు కీర్తింప తగినవాడవు. సంతోషకర మార్గాల ద్వారా మమ్ములను సమస్త దుఃఖాలనుండి సుదూరంగా తీసుకువెళ్ళు. మా ఊరు, దేశము, ప్రపంచము సుభిక్షంగా ఉండుగాక! మా పిల్లలకు, వారి పిల్లలకు సంతోషాన్ని ఇచ్చేవాడిగా నువ్వు ఉందువుగాక!

ఓ అగ్నిదేవా! నీవు శ్లాఘనీయుడవు. సునాయాసమైన మార్గముల ద్వారా మమ్ములను సమస్త దుఃఖముల నుండి దూరముగా తీసుకువెళ్ళు. మా స్వస్థలము, మా మాతృభూమి, సమస్త ప్రపంచము సస్యశ్యామలముగా, సుభిక్షముగా ఉండుగాక! మా పిల్లలకు, వారి పిల్లలకు ఆనందమును కలుగజేయుదువుగాక!

04. విశ్వా ని నో దుర్గహా జాతవేదః

సింధున్న నావా దురితాఽతి పర్షి।

అగ్నే అత్రివన్మనసా గృణానోఽస్మాకం

బోధ్యవితా తనూనామ్॥

అగ్నిదేవా! సమస్త దుఃఖాలను హరించేవాడా, సముద్రంలో పడి తల్లడిల్లే వ్యక్తిని పడవ మూలంగా కాపాడే రీతిలో దుఃఖాల బారినుండి మమ్ములను రక్షించు. మా శరీరాలను కాపాడేవాడా! “యావన్మందీ సంతోషంగా ఉండుగాక” అంటూ మనస్సులో పదేపదే చెబుతున్న అత్రి మహర్షిలా మా శ్రేయస్సును మనస్సున జ్ఞప్తియందు ఉంచుకో.

సమస్త దుఃఖములను హరించు నీవు సముద్ర మధ్యంలో వ్యక్తిని నావ ద్వారా కాపాడే రీతిలో దుఃఖముల బారి నుండి మమ్మల్ని రక్షించి కాపాడు. మా శరీరాలను కాపాడే ఓ అగ్నిదేవుడా! జనులందరు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకునే అత్రి మహర్షి వలె మా శ్రేయస్సును ఎల్లప్పుడూ మనస్సునందు ఉంచుకో.

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

05. పృతనా జితగ్ం సహ మానముగ్ర-
-మగ్నిగ్మ్ హువేమ పరమాథ్ సధస్థాత్।
స నః పర్షదతి దుర్గాణి విశ్వా
క్షామద్దేవో అతి దురితాఽత్యగ్నిః॥

శత్రుసైన్యాన్ని ముట్టడించేవాడూ, వాటిని నాశనం చేసేవాడూ, ఉగ్రమైనవాడూ అయిన అగ్నిదేవుణ్ణి సభయొక్క అత్యున్నత స్థానం నుండి ఇక్కడకు వేంచేయమని ఆహ్వానిస్తున్నాము. ఆయన మమ్ములను సమస్త - క్లేశాలకూ - నశించేవాటికీ - తప్పిదాలకూ - ఆవలకు తీసుకువెళ్ళుగాక. మమ్ము కాపాడుగాక!

శత్రుసైన్యమును ముట్టడించి నాశనము చేసేవాడు, ఉగ్రరూపుడు అయిన ఆ అగ్నిదేవుణ్ణి సభ యొక్క అత్యున్నత స్థానమునుండి ఇక్కడకు వేంచేయమని మేము ఆహ్వానిస్తున్నాము. ఆయన మమ్ములను సమస్త క్లేశములు, నశ్వరములు మరియు అపరాధముల నుండి రక్షించి కాపాడుగాక!

06. ప్రత్నోషి కమీడ్యో అధ్వరేషు
సనాచ్చ హోతా నవ్యశ్చ సత్సి।
స్వాంచాఽగ్నే తనువం పిప్రయ-
-స్వాస్మభ్యం చ సౌభగమాయ-జస్వ॥

అగ్నిదేవా! యాగాలలో కీర్తింపబడుతున్న నువ్వు మా ఆనందాన్ని ఇనుమడింప జేస్తునావు. యాగం చేసేవారిలో సనాతనుడిగాను, క్రొత్తవాడిగాను నువ్వు ఒప్పారు తున్నావు. నీ రూపంగా ఉంటున్న మాకు సంతోషం ప్రసాదించాలి. మాకు సర్వతోముఖ శ్రేయస్సును తీసుకురావాలి.

ఓ అగ్నిదేవా! యజ్ఞయాగాదులలో కీర్తింపబడుతున్న నీవు ఆనందమును పెంపొందిస్తున్నావు. ప్రాచీన కాలమునుండి నేటివరకు నిర్వహింపబడుతున్న యజ్ఞయాగాది క్రతువులలో నీవు హవ్య వాహనునిగా ఉంటున్నావు. నీ స్వరూపములుగా ఉంటున్న మాకు ఆనందమును కలుగజేయి. మాకు సర్వతో ముఖమైన శ్రేయస్సును ప్రసాదించు.

07. గోభిర్జుష్ట మయుజో నిషిక్తం

తవేంద్ర విష్ణోరనుసంచరేమ।

నాకస్య పృష్ఠమభి సంవసానో

వైష్ణవీం లోక ఇహ మా దయంతామ్॥

భగవంతుడా! నువ్వు పాపం అంటనివాడవు. సకలవ్యాపివి. అసంఖ్యాకమైన పశువులతో కూడిన సంపదను పొంది పరమానందం అనుభవింప మేము నిన్ను వెన్నంటుతాం. విష్ణుస్వరూపమైన దేవిపట్ల మాకున్న భక్తి నిమిత్తం ఉన్నత దేవలోకంలో వసించే దేవతలు యీ ప్రపంచంలో మాకు సంతోషాన్ని ప్రసాదించుగాక!

నీవు పాప దుఃఖములకు అతీతుడవు. సర్వవ్యాపివి. అసంఖ్యాకమైన పశు, ధన, ధాన్య సంపదలను పొందగోరి, పరమానందము కొరకు, మేము నిన్ను సేవించగలిగే భాగ్యమును మాకు ప్రసాదించు. విష్ణు స్వరూపమైన దేవియందు భక్తి ప్రపత్తులు, అత్యున్నతమైన దేవలోకమందు నివసించే దేవతలు మమ్ములను ఆశీర్వదించి మాకు ఆనందమును కలుగ జేయుగాక.

08. ఓం కాత్యాయనాయ విద్మహే కన్యకుమారి ధీమహి

తన్నో దుర్గిః ప్రచోదయాత్॥

ఓం కాత్యాయినీ దేవిని తెలుసుకొందాము. అందు నిమిత్తం ఆ కన్యాకుమారి దేవిని ధ్యానిద్దాం. ఆ దుర్గాదేవి మనకు ప్రేరణ నిచ్చుగాక!

శక్తి స్వరూపిణియైన కాత్యాయనీ దేవిని గురించి తెలుసుకుందాం. అందుకొరకు ఆ కన్యాకుమారీదేవిని ధ్యానించుదాం. ఈ మన ధ్యానయత్నంలో ఆ దుర్గాదేవి మన బుద్ధిని వికసింపజేయుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

– – –

అహంకారమనే అగ్నిని విశిష్ట దుర్గాగ్నిలో కలిపేయమని, భవసాగరాన్ని దాటించమని, వివక్ష లేకుండా విశ్వమంతటికీ శాంతి, క్షేమం చేకూర్చమనీ ప్రార్థించారు.

'లోక భ్రాంతులను అధిగమించే శక్తినివ్వు తల్లీ! పాప కర్మలను దహించు. అసూయ లేని అనసూయా దేవిని పెళ్లాడిన అత్రి మహర్షి ధ్యాన స్థాయిని మాకు ప్రసాదించి స్వార్థమనే చెర నుంచి మమ్మల్ని విడిపించు. సాధారణ మానసిక స్థాయి నుంచి మహిమాన్విత స్థితికి చేర్చు'.

నేను నాది అనే ద్వంద్వ భావన ఆధ్యాత్మిక మార్గంలో పెద్ద అడ్డంకి. ఉన్నది ఒక్కరే అనే భావన రావాలంటే దుర్గారాధనే ఉత్తమ మార్గం.

యావత్ సృష్టి రహస్యమంతా ఈ రుక్కుల్లో నిక్షిప్తం చేశారు అత్రిమహర్షి. – నేను, నాది, మనది, అందరిదీ – అనే భావాన్ని ఆధ్యాత్మిక భాషలో వ్యష్టి, సమష్టి, సృష్టి, పరమేష్టి అంటారు. నేను అంటే వ్యష్టి లేదా ఒంటరి. పెళ్లితో భార్యను పొంది సమష్టి అవుతాడు. ఇద్దరూ కలిసి సృష్టి చేస్తారు. అదే మనం. కాలక్రమంలో తమను నడుపుతున్న పరమేష్టి అందరిదీ అని గ్రహిస్తారు. భ్రాంతిమయ ప్రపంచంతో మన అనుబంధం శరీరానికే పరిమితమై, సర్వం మాతేనన్న భావనకు రావాలి.

ఈ దుర్గాసూక్తం అన్ని మతాలనూ ఒక్కటిగా చూసే విశ్వశ్రేయం. రాక్షస ఆలోచనలను చంపేయడమే ఇందులో ఉన్న అసలైన సందేశం ఇదీ రుక్కుల సారం.

ప్రతి మహిళా దుర్గామాత అంశే. దుర్గ పదానికి లోతైనదని అర్థం. స్త్రీ హృదయం కూడా ఎంతో లోతైనది. భావోద్వేగాలను హృదయంలోనే దాచుకుని ప్రేమ, కరుణ, క్షమ చూపిస్తుంది. ఈ సుగుణాలతోనే సృష్టి సజావుగా సాగేది. అందుకే ప్రతి మహిళా దుర్గా స్వరూపమే. ఆ దేవి అంశేనన్నారు.

జీవితంలో ఎదురయ్యే వడిదుడుకులను ఈ సూక్త పారాయణ మూలంగా అధిగమించవచ్చని విశ్వసింపబడుతున్నది.

ఋగ్వేదంలో అనేక చోట్ల కానవచ్చే ఈ సూక్తులలో అనేకం అగ్నిదేవునిని కీర్తిస్తూ ప్రార్థించేవిగా ఉన్నాయి.

తైత్తిరీయ అరణ్యకంలో ఇవి సంకలనం చేయబడి దుర్గా సూక్తం పేరిట ప్రబలుతున్నాయి.

– = – = –

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute